క్లుప్తంగా

అరకులోయలో స్వచ్ఛభారత్



మ్యూజియం వద్ద చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

అరకులోయ టౌన్: మండల కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ సహాయంతో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అరకు గిరిజన మ్యూజియంతో పాటు పలు ప్రాంతాల్లో చెత్త చెదారాలను సిబ్బంది తొలగించినట్టు పర్యాటక శాఖ సహాయ సంచాలకుడు ఆర్.కృపాకర్ తెలిపారు. భారత ప్రభుత్వ అధికారి కె.ప్రవీణ్‌కుమార్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అధికారులు దాసు, రత్నరమ, స్కిల్ డెవలప్‌మెంట్ పాఠశాల అరకులోయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

56 మందికి వైద్య పరీక్షలు



వాతంగిలో శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రాంలో 56 మంది రోగులకు వైద్య సేవలు అందజేసినట్లు 104 డీఈఓ శ్రీనివాస్ తెలిపారు. 8 మంది హైపర్‌టెన్షన్, ఆరుగురు సుగర్ పేషెంట్లకు, పది మంది గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవసరమైన సూచనలు మందులిచ్చామన్నారు. ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మణరావు, ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతి, ఎంపీహెచ్‌ఎం శ్యామల, ఎంపీహెచ్ఏ రాంబాబు, ఏఎన్ఎం లీలావతి, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు.

కొత్తాడలో గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ కామరాజు

గంగవరం : జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని, పనులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి ఏపీవో ప్రకాశ్ అన్నారు. కొత్తాడ గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ పనులు గుర్తింపుపై సర్పంచ్ ఎస్.కామరాజుదొర అధ్యక్షతన శనివారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తాడ గ్రామ పంచాతీలో చేపట్టనున్న పనులను ఏఈవో ప్రకాశ్ వివరించారు. సచివాలయ కార్యదర్శి అజయ్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా సర్వే చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ రామకృష్ణ అధ్యక్షతన శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో భూ పట్టాల పంపిణీ కోసం సమగ్రంగా, సక్రమంగా, పారదర్శకంగా సర్వే చేయాలని కోరారు. రీసర్వేలో భాగంగా వాటిని పూర్తిగా పరిశీలించి వారసత్వ భూములకు సంబంధించి పట్టాలను పొందాలన్నారు. మాజీ ఎంపీపీ బాలరాజు, సర్వేయర్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులు, పూడికతీత పనులను సర్పంచ్ దురియా పుష్పలత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పంచాయతీలో దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి, కో–ఆప్షన్ మెంబరు నాజర్‌వలి, కూటమి నాయకుడు నాగభూషణం పాల్గొన్నారు.

వరదొస్తే.. ముంపే



గోదావరి వరదలకు పోలిపాక వద్ద పెచ్చులూడిన రహదారి



కోతకు గురైన ముర్మూరు రోడ్డు

- అధ్వానంగా పోలిపాక– ముర్మూరు రోడ్డు
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కూనవరం: గోదావరి వరదల సమయంలో కూనవరం, భద్రాచలం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పోలిపాక, ముర్మూరు మధ్య ఆధ్వానంగా తయారవుతుంది. దీనికి శాశ్వత పరిష్కారం కావాలని ప్రజలు కోరుతున్నారు. కూనవరం, వి.ఆర్.పురం మండల ప్రజలు నిత్యం తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణంతో వ్యాపార లావాదేవీలు, ప్రయాణాలకు, పబ్బాలకు ముడిపడి జీవనం సాగిస్తుంటారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు తదితర సరకులు కోసం పొరుగునున్న భద్రాచలం వెళ్లొస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రహదారి వరదల సమయంలోను, వరదలు తగ్గిన వారం రోజులు వరకు మూతపడే ఉంటుంది. జూలై, ఆగస్టు మాసాల్లో వచ్చే గోదావరి వరదలు భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరగానే పోలిపాక, ముర్మూరు మధ్యలో ఈ రహదారిపైకి వరదనీరు చేరుతుంది. తద్వారా వాహనాల రాకపోకలు స్తంభిస్తాయి. రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. జనజీవనం అస్తవ్యస్తంగా మారుతుంది. 50 అడుగుల మేర వరదనీరు రోడ్డుపైకి చేరి గ్రామాలు ముంపునకు గురికావు కాని పోలిపాక, ముర్మూరు వద్ద రోడ్డు బ్లాక్ అవుతోంది. వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోతుంది. పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తుంది. రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతుంటారు. వరదలు తగ్గుముఖం పట్టినా వారం రోజుల వరకు రాకపోకలకు సజావుగా సాగవు. రోడ్డు పైన మోకాళ్లలోతు సిల్ట్ పేరుకుపోతుంది. సంబంధిత అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు.

తూతూ మంత్రం మరమ్మతులు

వరద నీరు తక్కుముఖం పట్టిన వెంటనే రోడ్డు పైన పేరుకుపోయిన సిల్ట్‌ను (బురదను) తొలగించి, గుంతలు పూడిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. వరదల సమయంలో అధికారులు సకాలంలో స్పందించిన దాఖలాలు లేవు. బురదంతా ఎండిపోయాక దానిపై గ్రావెల్ చల్లి మరమ్మతులను మమా అనిపిస్తారనే ఆరోపిస్తున్నారు. వరదలు, వర్షాలకు ఆ గ్రావెల్ కొట్టుకుపోయి, గుంతలు మరింత పెద్దవిగా మారి వాహనచోదకులను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నాయి. గోదావరి వరదలు మండలాన్ని ఈ ఏడాది మూడుసార్లు ముంచెత్తింది. ప్రతీ ఏటా ఇదే తంతు అయినా రహదారుల మరమ్మతుకు ఆర్అండ్‌బీ అధికారులు చోద్యం చూసుంటారు.

ఎత్తు పెంచి, సిమ్మెంట్ రోడ్డు నిర్మించాలి

పోలిపాక, ముర్మూరు రోడ్డుకు శాశ్వత పరిష్కారం కావాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతుల వల్ల ఏటా అన్ని విధాలుగా నష్టపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పోలిపాక, ముర్మూరు మధ్యలో ప్రధాన రోడ్డు కొతకు గురికాకుండా రివిటింగ్ వాల్ నిర్మించి, పది అడుగుల మేర ఎత్తు పెంచి, సిమెంటు రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఆదాయానికి గండి



వ్యాపారస్తులు ఆర్డర్ చేసిన సరకులను భద్రాచలం నుంచి కూనవరం, వి.ఆర్.పురం తీసుకొచ్చి ఇస్తుంటాను. తద్వారా రోజుకు అన్ని ఖర్చులు పోగా సుమారు వెయ్యి రూపాయల వరకు ఆదాయం వస్తుంది. వరదల సమయంలో పోలిపాక, ముర్మూరు మధ్య రోడ్డు బ్లాక్ అవుతుంది. అప్పుడు పది, పదిహేను రోజులు రాకపోకలు ఉండవు. ఆ నెలంతా సక్రమంగా పనులుండవు దీంతో జీవనోపాధి చాలా కష్టంగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి

– యడ్ల సురేంద్ర, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్, కూనవరం

సమస్య పరిష్కరించాలి



మాది ఎటపాక మండలం చోడవరం గ్రామం. నేను ప్రతి రోజు భద్రాచలం నుంచి పండ్లు తెచ్చి జగ్గవరం, కూనవరం, టేకులబోరు, విఆర్ పురం గ్రామాల్లో దుకాణాలకు సప్లై చేస్తుంటాను. రోజుకు ఆటో ఖర్చులు పోగా రూ. 800 నుంచి రూ. 1000 వరకు ఆదాయం వస్తుంది. వరదల సమయంలో పోలిపాక వద్ద రోడ్డు దారుణంగా ఉంటుంది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో ఆదాయం నిలిచిపోతోంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలి.

– బుద్దుల లక్ష్మయ్య, చోడవరం గ్రామం, కూనవరం మండలం

రోడ్డు కోసం ఆమోదం



పోలిపాక, ముర్మూరు మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై 175 మీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమోదం వచ్చింది. ఈ మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలు మంజూరయ్యాయి, టెక్నికల్ శాంక్షన్ కూడా వచ్చింది. టెండరు పూర్తి కాగానే పనులు చేపడతాం.

– సిద్దార్థ, ఆర్అండ్‌బీ ఏఈఈ , చింతూరు డివిజన్

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని ప్రిన్సిపాల్ పట్నాసి చలపతిరావు అందజేశారు. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వివిధ ఆటల పోటీల్లో పాల్గొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, గుర్తింపు తీసుకురావాలని కోరారు. కళాశాల క్రీడా ఇన్‌చార్జి సుభాన్, అధ్యాపకులు ధర్మారావు, బాలరాజు, మురళి, సరస్వతి, అన్నపూర్ణ, లలితకుమరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మోటార్ ఏర్పాటు



బోరు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో తాగునీటి బోరు పాడైపోవడంతో స్థానికులు రెండు రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. దీనిపై సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు స్పందించి రూ.20వేలు పంచాయతీ నిధులతో మరమ్మతు పనులు చేయించారు. బోరుకు మోటార్ ఏర్పాటుచేయించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. గ్రామస్తులు ప్రేమానందం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో ఓపెన్ హౌస్



గంగవరం స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భూషణం



అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్న సిబ్బంది

గంగవరం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ డి.భూషణం ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆశ్రమబాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు వ్యవస్థ ప్రాముఖ్యం, పోలీసు విధులు, హక్కులు, చట్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐలు రజాక్, సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డతీగల: పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా శనివారం అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ నరసింహమూర్తి పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, ఆయుధాలు వినియోగం తదితర అంశాలతో పాటు పోలీసుల విధులు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు.పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ మారిన నాయకులను ప్రజలు క్షమించరు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, నాయకులు

గూడెంకొత్తవీధి: స్వార్థ ప్రయోజనాల కోసం గతంలో అనేక పదవులు పొందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే పార్టీ మారడాన్ని ప్రజలు క్షమించరని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్ అన్నారు. ఆయన శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కల్చరల్ విభాగం వైస్ ప్రసిడెంట్ చంటిబాబు, గూడెం కొత్తవీధి నాయకులు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ రామారావు తదితరులు మాట్లాడారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక పదవులు, ప్రయోజనాలు పొందిన నాయకులు ఇప్పుడు అధికారం కోల్పోగానే వేరే పార్టీలో చేరుతున్నట్టు ప్రకటనలు చేయడం దారుణమన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారిన నాయకులను ప్రజలు క్షమించరని వారు స్పష్టం చేశారు.

దుకాణాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి



బాణసంచా దుకాణాల ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ భూషణం

గంగవరం : దీపావళిని పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న దుకాణదారులు నిబంధన పాటిస్తూ బాణసంచా విక్రయాలు సాగించాలని తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, ఎస్ఐ డి.భూషణం అన్నారు. గంగవరంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న స్థలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల వద్ద ఇసుక నీరు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని దుకాణదారులకు సూచించారు. వీఆర్వో రవి, సర్వేయర్ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీఎం రామాంజేయులు, స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్ తదితరులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏపీఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న లక్‌పతి దీదీపై అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్ఈడీ బల్బులు తయారీ, పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్, ఆన్‌లైన్ వ్యాపారం వంటి అంశాలను వివరించారు.లింకేజీ రుణాల రికవరీని పూర్తి చేయాలని సూచించారు. స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్, సీసీ రామకృష్ణ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసాదరావు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అరకులో బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై ఇండో హ్యూమన్ రైట్స్ చైర్మన్ రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత పదవులు ఆశించాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అధ్యాపకులు చంద్రశేఖర్, పూర్ణేశ్వర్, అప్పలనాయుడు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విజయ్, రాము, హేమలత, గాసి, సంతోష్‌కుమార్, సింహాచలం, ప్రభాకర్ తదితరులున్నారు.

సమావేశంలో సమస్యల వెల్లువ

హుకుంపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని, భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు అధికారులను సభ్యులు నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవో రమదేవి పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తల్లి పేరుతో మొక్క నాటి (ఏక్ పేడ్ మా కా నాం) కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు వై.వి జయలక్ష్మి, మొష్యా అనిత కుమారి, పసుపులేటి నాగబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటేలా స్థానికులకు విద్యార్థులు చైతన్యం కల్పించాలని కోరారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, అధ్యాపకులు లచ్చన్న, కొండబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ కొండపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ బోయినకుమారి శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రహదారుల పనులు త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోహర్, కూటమి నాయకుడు లక్ష్మయ్య, వార్డు సభ్యుడు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది శ్రమదానం



శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రామకృష్ణ, సచివాలయ సిబ్బంది

గంగవరం: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ ఉద్యోగులు శనివారం శ్రమదానం చేపట్టి పారిశుధ్య పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెత్తచెదారాలను తొలగించారు. ఈఓపీఆర్డీ నరసింహారావు, సిద్దేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం



కొమరాపురంలో ప్రకృతి వ్యవసాయ వనరుల దుకాణం

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయతీ, కొమరాపురం గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం వనరుల విక్రయ దుకాణం ఏర్పాటు చేసినట్టు మండల ప్రకృతి వ్యవసాయ కేంద్రం కో–ఆర్డినేటర్ అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విక్రయ దుకాణంలో ఆరోగ్యకరమైన పంటల సాగుకు, పంటల సస్యరక్షణకు అవసరమైన జీవామృతాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మండలంలోని లోదొడ్డి, వాతంగి పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలకు బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, పాపారావు, సత్యనారాయణ, చిన్నారి, రైతులు పెంటయ్య, నాగరాజు, రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు ప్రారంభం



సెల్ టవర్ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ నిర్మాణ పనులు మొదలైయ్యాయి. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సన్యాసిరావు, తిరుపతిరావు, రాజారావు సెల్ టవర్ నిర్మాణ పనులకు పూజలు చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న పంచాయతీకి సెల్ సిగ్నల్స్ లేక తీవ్ర అవస్థలు పడుతూ వచ్చామని, ఆన్‌లైన్ పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, సెల్ టవర్ కోసం గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎట్టకేలకు సెల్ టవర్ మంజూరు కావడం, పనులు ప్రారంభమవడం ఆనందంగా ఉందన్నారు. సెల్ టవర్ అందుబాటులోకి వస్తే ఇంటర్నెట్ తదితర కష్టాలు తీరుతాయని వారు చెప్పారు. ఈ సందర్భంగా టవర్ నిర్మాణం కోసం భూమిని అందజేసిన రాజారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్తులు విశ్వనాథంపడాల్, కృష్ణారావు, పడాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



కొయ్యూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి



గార్లపాడులో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి



అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుధ

కొయ్యూరు/అడ్డతీగల/ గంగవరం: జిల్లాలోని కొయ్యూరు, అడ్డతీగల, గంగరం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా ప్రాంత ఐసీడీఎస్ సీడీపీవోలు విజయకుమారి, సుధ, లక్ష్మి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటికి గిరిజనులు దూరంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. దీంతో పాటు బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీఆర్ వైద్య మిత్రలు

ముంచంగిపుట్టు: ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పనిచేస్తున్న ఫీల్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది కోరారు. మండలం కేంద్రలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ మిత్రలు గోపాల్‌రావు, మహేశ్వరి, తేజవతి, వైద్య సేవ డీఈవో వంశీకృష్ణ తదితరులు నల్లరిబ్బన్లు ధరించి శనివారం విధులు నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలికి సమస్యలు పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న తమకు సమానపనికి సమానవేతనం అమలు చేయాలని, అందరికీ ప్రమోషన్లు కల్పించాలని, చనిపోయిన సిబ్బందికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 29 నుంచి విధులు బహిష్కరిస్తూ, సమ్మెలో పాల్గొంటామన్నారు.

కూనవరం: స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా సిబ్బందితో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జోగారావు శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సర్వేశ్వరరావు, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.